# రాంగ్ నెంబర్

ఎమ్.నాగలక్ష్మి



"హలో!"

"కమల ఉందా? కాస్త పిలుస్తారా?" అవతలి పక్కనుంచి సన్నని గొంతు.

"సారీ, రాంగ్ నంబర్!" ఫోన్ పెట్టేయబోయాను.

"చాలా అర్జంటండీ ... ఒక్కసారి పిలవండి. ఎక్కువసేపు మాట్లాడనులెండి!"

"చూడండి, మీరు ఎక్కువసేపు మాట్లాడినా, తక్కువసేపు మాట్లాడినా నాకేం అభ్యంతరం లేదు కానీ, ఆ కమలెవరో ఇక్కడ ఉండదు. ఇది బ్రహ్మచారి కొంప! సారీ!" మళ్లీ పెట్టేయబోయాను.

"ప్లీజ్, కాస్త వినండి! కమలకింకా పెళ్లి కాలేదు.

అది నాకు తెలీదా ఏంటి? మీరు వాళ్లన్నయ్య. కాస్త కమలని ..."

పొద్దున్నే రాంగ్ నంబర్ తగిల్చావేమిటి దేవుడా, అసలే లేటని ఏడుస్తుంటే?

ఒళ్లు మండుకొచ్చింది.

"చూడు, తల్లీ! నా చెల్లెలు కమల కాదు, విమల. అది ఢిల్లీలో ఉంటుంది. ఇది రాంగ్ నంబరంటే వినరేమిటి?"

"మీరు భలే మాట్లాడతారండీ ....! నేను కరెక్ట్‌గా డయల్ చేసినప్పుడు మీది రాంగ్ నంబరెలా అవుతుంది? కాస్త కమలని ..."

అయ్యబాబోయ్! ఈ పిల్లెవరో జిడ్డురకం దేవుడో! "ఏవండీ, ఇంతకీ మీకే నంబరు కావాలి?"

"మీ నంబరే. కమలతో కాలేజీ డ్రామా గురించి అర్జంటుగా మాట్లాడాలి. కమల చెప్పింది, ఫ్రెండ్స్ ఫోన్ చేస్తే మీకిష్టం ఉండదని. కానీ, ఇది కాస్త అర్జంటు. అందుకని, ప్లీజ్ .... కొంచెం పిలిస్తే ...."

గడియారంవంక చూసి గుండె గుభేల్‌మంది. పావుగంట గడిచిపోయింది. అమ్మో, స్నానం చేసి ఎయిర్‌పోర్ట్‌కి వెళ్లాలి. 'డ్రామా కాలేజీలో కడుతోందా, నాతో ఫోన్‌లో కడుతోందా?'

"చూడండీ, అవతల మీకంటే ఎక్కువ అర్జంట్ పని నాకుంది. నేను గబగబా వెళ్లకపోతే నా ఉద్యోగం ఊడుతుంది!"

"అంటే తుమ్మితే ఊడే ఉద్యోగం చేస్తున్నారన్నమాట?" అవతలపక్కనుంచి నవ్వుల వాన.

నాకర్థమైంది ఈ పిల్లెవరో చేతికి చిక్కిన నంబరు నొక్కి కాలక్షేపం చెయ్యాలనుకుంటోందని.

"నా ఉద్యోగం తుమ్మితే ఊడేదో, దగ్గితే ఊడేదో మీ కనవసరం. కాస్త నంబరు జాగ్రత్తగా చూసి మీ కమల ఇంటికి ఫోన్ చెయ్యండి!" ఆవైపు నుంచి మరే శబ్దమూ రాకుండా ఫోన్ క్రెడిల్ మీద పెట్టేసి ఊపిరి పీల్చుకుని బాత్‌రూమ్‌కి పరుగెత్తాను. రెండు నిమిషాల్లో గబగబా షవర్ కింద నుంచుని స్నానం అయిందనిపించి బయటికి వచ్చేసరికి ఫోన్ "ట్రింగ్ ట్రింగ్"మంటోంది.

ఈసారెవరో ...? ఆ సన్నటి గొంతు అమ్మాయి మాత్రం అయి ఉండదు. రాంగ్‌నంబరు చేసిన ఆ అమ్మాయికి మళ్లీ నా నంబరు తగలడం కలలో మాట!

"హలో!"

"హలో! కాస్త కమలని పిలుస్తా...."

నాకు షాక్ కొట్టినట్టయింది. మళ్లీ నా నంబరే చేసిందే? ఈమెవరబ్బా? నేనున్న ఇంటి దగ్గర ఏ కాలేజీ అమ్మాయీ లేదు. నాకే అమ్మాయీ తెలియదు.

"ప్లీజ్ ...."

## ఇంటర్వ్యూ

మిలటరీ కాంప్‌లో ఇన్‌స్పెక్షన్ జరుగుతోంది. ఆఫీసరు ఒక సైనికుడిని ఇలా ప్రశ్నించాడు: ఎగురుతున్న విమానంలోంచి ఎన్నిసార్లు కిందికి దూకావ్?

జవాన్: ఒక్కసారి!

ఆఫీసర్: అదేమిటి...నీ పర్సనల్ ఫైల్‌లో పదిహేనుసార్లు దూకినట్లు రాసి ఉంది?

జవాన్: నేను ఒక్కసారే దూకాను...మిగతా పద్నాలుగుసార్లూ ఎవరో తోసేశారు.

**-తరిగొప్పుల వి.ఎల్.ఎన్. మూర్తి,**
హైదరాబాదు

నాకర్థమైంది ఇంక ఈ పిల్లను వదుల్చుకోవడం కష్టమని. తను చేస్తున్న నంబరు, రాంగ్ అని తేలితే కానీ వదలదని.

"మీ పేరేమిటండీ?"

"మాయ."

పొద్దున్నే పనివేళా .... హే భగవాన్! ఏమిటో నీ మాయ? ఫోన్ డిస్‌కనెక్ట్ చేద్దామంటే బాస్ ఫోనొకటి రావాలి.

"చూడండి మాయాదేవీ! మీ రెక్కడనుంచి మాట్లాడుతున్నారు?"

"మీ రెక్కడనుంచి మాట్లాడుతున్నారో, అక్కడనుంచే!"

"వ్వాట్....?" అదిరిపడ్డాను. ఇల్లంతా కలయచూశాను. కిటికీలోంచి కనిపించినంతమేరా వెతికాను. ఎవరైనా అమ్మాయి సినిమాల్లోలా మొబైల్ ఫోన్ పెట్టుకుని నన్ను అల్లరి పెట్టడంలేదు కదా!

అటునుంచి జలజలా రాలుతున్న నవ్వులు.

"అటూ ఇటూ వెతుకుతున్నారు కదూ? మీలాగే ఇంట్లోనుంచి అని నా అభిప్రాయం. అయినా మీరెక్కడనుంచి చేశాననుకుంటున్నారు?"

"పిచ్చాసుపత్రి నుంచేమో అని ..." కాస్త కచ్చగా అన్నాను.

"మీరు భలే సరదాగా మాట్లాడతారండీ! కమల మీ గురించి అన్నీ అబద్ధాలు చెప్పింది. మీరు కోపిష్టి అనీ, ఓ సరదా ... చట్టుబండా అంటే పడదనీ ...."

"చూడండీ, మహామాయగారూ! మీ నంబరు చెప్తారా? కమల కూరలకు వెళ్లింది, రాగానే ఫోన్ చెయ్యమంటాను."

"ఓహో... ఆ దారికి వచ్చారన్నమాట! కమలకి నా నంబరు తెల్సు. ఫోన్ చేయమని చెప్పండి చాలు!" అటునుంచి ఫోన్ పెట్టేసిన చప్పుడు.

కాస్త లేటుగా, ట్యూబ్‌లైటులా వెలిగినా బ్రహ్మాండమైన అస్త్రం అందించిన నా బుర్రని నేనే తట్టుకుని, గబగబా ప్రయాణానికి తయారైపోయాను. సగం దూరం వెళ్లాక గుర్తొచ్చింది రాత్రి ఇంపార్టెంట్ ఫైలొకటి చదివి టీపాయ్ అడుగున పెట్టానని. అది లేకుండా వెళ్లి ప్రయోజనం లేదని కారు వెనక్కి తిరిగింది. కాలం ముందుకి జరిగింది. మళ్లీ నేను ఎయిర్‌పోర్ట్ చేరుకునేసరికి ఫ్లయిట్ వెళ్లి ముచ్చటగా మూడు నిమిషాలయిందని తెలిసింది.

పొద్దున్నే బుర్ర తినేసిన పిల్లని తిట్టుకుంటూ బాస్ తిట్లకి సిద్ధమవుతూ ఆఫీస్‌కి చేరుకున్నాను.

బాస్‌తోసహా అందరూ కళ్లూ ముక్కులూ తుడుచుకుంటూంటే ఏమైందోనని కంగారుపడ్డాను.

నన్ను చూసి వాళ్లంతకంటే కంగారుపడ్డారు.

కళ్లు తుడుచుకుని వాళ్లని వాళ్లు గిల్లుకుని, నన్ను గిల్లి అడిగారు ఎలా తప్పించుకున్నావని?

"తప్పించుకోవడమేమిటి?"

అప్పుడు తెలిసింది అసలు సంగతి నేను ఎక్కాల్సిన ఫ్లయిట్ టేకాఫ్ చేసిన పావుగంటకే క్రాష్ అయిందని! ఛాయ్‌కి వెళ్లిన ప్యూన్ ఫ్లాష్ న్యూస్‌లో ఈ వార్త చూసి అందరికీ చెప్పాడని.

లోపల రాంగ్ నంబర్‌కి ధన్యవాదాలు చెప్పుకుంటూ, పైకి "అంతా దైవ మాయ!" అన్నాను. ■

